సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



50శాతం టికెట్లు ఇవ్వాలి

ఎన్నికల్లో అన్ని పార్టీలు 50 శాతం టికెట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. 8లో▸



విజయవంతం చేయాలి

చేవెళ్లలో ఈనెల 26న జరిగే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. 8లో▸



సామూహిక అత్యాచారం

కత్తులతో బెదిరించి నలుగురు యువకులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 8లో▸



ఆమనగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బాణసంచా కాలుస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

సిట్టింగ్‌లకే స్టీరింగ్



బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా వెల్లడి

- జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ మళ్లీ వారే..
- ఆశావహులకు లభించని అవకాశం
- పక్క చూపులు చూస్తున్న నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార బీఆర్‌ఎస్ ఎన్నికల శంఖారావం పూరించింది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను ముందస్తుగానే ప్రకటించింది. జిల్లాలో మళ్లీ సిట్టింగ్‌లకే అవకాశం కల్పించింది. దీంతో అభ్యర్థులను మార్చనున్నారనే ఊహాగానాలకు తెరపడింది. అధిష్టానం ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో నలుగురు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, ముగ్గురు బీసీ, ఒకరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. కొంత కాలంగా టికెట్‌పై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది. ఈసారి బరిలోకి దిగాలని భావించిన వారసులకు సైతం నిరీక్షణ తప్పలేదు.

ఏ నియోజకవర్గంలో ఎవరంటే..?

మహేశ్వరం నుంచి మంత్రి పి.సబితారెడ్డి, ఎల్బీనగర్ నుంచి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి నుంచి గుర్క జైపాల్ యాదవ్, షాద్‌నగర్ నుంచి ఎల్గనమోని అంజయ్య యాదవ్, చేవెళ్ల నుంచి కాలె యాదయ్య, రాజేంద్రనగర్ నుంచి ప్రకాష్‌గౌడ్, శేరిలింగంపల్లి నుంచి అరికెపూడిగాంధీ పేర్లను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కల్వకుర్తి అభ్యర్థిని మార్చనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో మళ్లీ సిట్టింగ్ అభ్యర్థికే టికెట్ ఇవ్వనున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఎన్నికలకు మరో మూడు నెలల గడువు ఉండగా అభ్యర్థులను ప్రకటించడం విశేషం.



మీర్‌పేటలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

పక్కచూపులు చూస్తున్న ఆశావహులు

ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, ఇబ్రహీంపట్నం నుంచి క్యామ మల్లేశ్ టికెట్ ఆశించారు. మహేశ్వరం నుంచి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రాజేంద్రనగర్ నుంచి ఎంపీ రంజిత్‌రెడ్డి సహా మంత్రి తనయుడు కార్తీక్‌రెడ్డి పోటీ చేయాలని భావించారు. కల్వకుర్తి నుంచి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, చేవెళ్ల నుంచి మాజీ ఎమ్మెల్యే రత్నం, షాద్‌నగర్ నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి టికెట్ ఆశించారు. వీరిలో ఏ ఒక్కరి వైపు కూడా అధిష్టానం మొగ్గు చూపకపోవడం గమనార్హం. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడి పని చేసినా.. ప్రాధాన్యత దక్కక పోవడంతో వారంతా అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. అవకాశం కోసం పక్క చూపులు చూస్తున్నారు. వీరిలో పలువురు బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంతా కలిసికట్టుగా పని చేయాలని, పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కేసీఆర్ హెచ్చరించడం కొసమెరుపు.

అసంతృప్త నేతలకు గాలం

బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ అప్రమత్తమ్యాయి. బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన ఆశావహులను తమ పార్టీలో చేర్చుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఆయా అభ్యర్థులతో రహస్యంగా మంతనాలు జరుపుతున్నాయి. ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశంతో పాటు ఇతర ఆఫర్లు ఇస్తుండటం విశేషం. అసంతృప్తుల్లో ఎంత మంది పార్టీ మారనున్నారనేది వేచి చూడాల్సిందే.



చేవెళ్లలో సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కొందుర్గులో సంబరాలు చేసుకుంటున్న పార్టీ నాయకులు

అభివృద్ధే విజయానికి సోపానం



ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సోపానాలవుతాయి. జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్లు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే మళ్లీ గెలిపిస్తుంది.

– పట్లోళ్ల సబితారెడ్డి, మహేశ్వరం

రుణం తీర్చుకోలేనిది



మరోసారి టికెట్ కేటాయించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాదాభివందనం. చెప్పలేనంత సంతోషంగా ఉంది. కేసీఆర్ రుణం తీర్చుకోలేనిది. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో నిరంతర సేవకుడిగా పనిచేస్తాను. మరోసారి ఆశీర్వదించాలి.

– కాలె యాదయ్య, చేవెళ్ల

జిల్లాలోని అన్ని స్థానాలు గెలుస్తాం



మళ్లీ పోటీ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయన పాలన, విధానాలకు అనుగుణంగా పనిచేస్తాం. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులందరితో కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలను కైవసం చేసుకుంటాం.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం

సంతోషంగా ఉంది



నాపై నమ్మకం ఉంచి సీఎం కేసీఆర్ మళ్లీ టికెట్ కేటాయించినందుకు సంతోషంగా ఉంది. ఉద్యమ నేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో పని చేస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉంది. షాద్‌నగర్ అభివృద్ధికి సీఎం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించారు.

– వై.అంజయ్య యాదవ్, షాద్‌నగర్

నమ్మకం ఉన్నందునే..



నాపై నమ్మకం ఉన్నందునే ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి పోటీ చేసే అవకాశం కల్పించారు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు. నియోజక వర్గానికి చేసిన అభివృద్ధి, ప్రజలకు చేసిన సేవలే మళ్లీ గెలిపిస్తాయి. అందరు నాయకులతో మాట్లాడి.. సమన్వయంతో ముందుకు సాగుతాం.

– జైపాల్‌యాదవ్, కల్వకుర్తి

భారీ మెజార్టీ ఖాయం



శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో విజయం సాధించి గులాబీజెండాను ఎగురవేస్తాం. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతతో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తా. ఎన్నికల్లో గెలిచాక శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టడానికి శాయశక్తులా కృషిచేస్తా.

– అరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి

సీఎంకు ధన్యవాదాలు



నాపై నమ్మకంతో ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయటానికి అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చాను. గత ఐదేళ్లుగా నిరంతరం ప్రజాసేవలోనే ఉన్నాను. కాబట్టి ప్రజలు నన్ను ఆదరిస్తారని ఆశిస్తున్నా.

– దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్బీనగర్

హామీలన్నీ నెరవేర్చా..



మరోసారి అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలు చేశాం. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చాను. వచ్చే ఎన్నికల్లోనూ అభివృద్ధే ప్రధాన నినాదంగా ముందుకెళ్తా. విజయం సాధిస్తా.

– టి.ప్రకాష్‌గౌడ్, రాజేంద్రనగర్

విద్యారంగంపై చిన్నచూపు తగదు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యారంగంపై ప్రభుత్వానికి చిన్న చూపు తగదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని, పాఠశాలలను ఊడ్చడానికి స్వీపర్లు కరువయ్యారన్నారన్నారు. జిల్లాలో ఒక్క మండలానికి కూడా పర్మినెంట్ మండల విద్యాధికారి లేరని, ఇన్‌చార్జి పాలన కొనసాగుతోందన్నారు. మధ్యాహ్న భోజనానికి నిధులు మంజూరు చేయకపోవడంతో నాణ్యమైన భోజనం అందడం లేదని మండిపడ్డారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న డిగ్రీ కళాశాలకు నేటికీ సొంత భవనాలు కరువయ్యాయని తెలిపారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, బి.శంకర్, ఉపాధ్యక్షులు చరణ్, శివ, సహాయ కార్యదర్శులు శివ, లిఖిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

31,99,674

- జిల్లా ఓటర్ల సంఖ్య
- ముసాయిదా విడుదల చేసిన ఎన్నికల కమిషన్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 3,369 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసింది. మొత్తం 31,99,674 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వీరిలో 16,62,692 మంది పురుషులు, 15,35,537 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.384 మంది ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లు ఉన్నారు. వీరితో పాటు ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 195 మంది ఉండగా, సర్వీసు ఓటర్లు మరో 866 మంది ఉన్నారు. ఈ మేరకు సోమవారం ఎన్నికల కమిషన్ ముసాయిదా జాబితాను విడుదల చేసింది.

నియోజకవర్గాల వారీగా నమోదైన ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్‌బూత్‌లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్స్	ఎన్‌ఆర్‌ఐలు	సర్వీసు ఓటర్లు
ఇబ్రహీంపట్నం	319	1,53,515	1,47,609	28	13	232
ఎల్బీనగర్	570	2,85,957	2,60,660	97	12	53
మహేశ్వరం	511	2,54,089	2,38,017	62	58	52
రాజేంద్రనగర్	535	2,71,909	2,47,858	32	76	74
శేరిలింగంపల్లి	622	3,52,243	3,10,115	138	18	93
చేవెళ్ల	298	1,24,535	1,19,619	04	4	52
కల్వకుర్తి	262	1,13,267	1,07,888	6	01	134
షాద్‌నగర్	252	1,07,177	1,03,771	17	13	134

అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారన్నారు. అధికారులు శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజావాణిలో 417 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

గొలుసుదొంగకు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: నగల దుకాణానికి కొనుగోలుకు వచ్చి గొలుసుతో ఉడాయించిన దొంగను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. ఈనెల 19న తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడలో ఓం ప్రకాష్ శివశక్తి నగల దుకాణంలోకి వచ్చి గొలుసు కావాలని అడిగాడు. లేకపోవడంతో వనస్థలిపురంలోని తెలిసిన దుకాణం నుంచి తెప్పించాడు. గొలుసు నచ్చిందని తీసుకొని మీకు ఫోన్–పే(ఆన్‌లైన్) ద్వారా డబ్బులు ఇస్తానని చెప్పి నమ్మించి ఉడాయించాడు. దుకాణదారుడి ఫిర్యాదు మేరకు ఆదిబట్ల పోలీసులు రెండు రోజుల్లో దొంగను పట్టుకున్నారు. నిందితుడు మలోత్ సురేష్(31) పిర్జాదిగూడలోని నివాసం ఉంటున్నాడని.. అతడి స్వగ్రామం జనగాం జిల్లా నెమెటపూర్ మండలం, బొమ్మపూర్ అర్బన్ తండాగా గుర్తించారు. పాతనేరస్తుడుగా పోలీసులు గుర్తించారు.

వ్యక్తి అదృశ్యం


అఖిల్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: చికెన్ సెంటర్ నిర్వాహకుడు అదృశ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న బనావత్ అఖిల్ ఈనెల 15న చికెన్ సెంటర్‌కు తాళం వేసి బ్యాంకు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఎంతకీ తిరిగిరాలేదు. దీంతో అఖిల్ తండ్రి ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

24నుంచి క్రికెట్ సెలెక్షన్స్

మొయినాబాద్‌రూరల్: ఈనెల 24న రాజేంద్రనగర్ జోనల్ లెవల్ క్రికెట్ సెలక్షన్స్ (14–17 సంవత్సరాలు) నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ జోనల్ కార్యదర్శి బాలస్వామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) రాజేంద్రనగర్ జోనల్ లెవల్ క్రికెట్ సెలక్షన్స్‌ను చిలుకూరు సమీపంలో గల రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్, మొయినాబాద్ మండలాలల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు పాల్గొనవచ్చునని సూచించారు. పాఠశాలల నుంచి బోనఫైడ్‌తో పాటు ఆధార్‌కార్డుతో తీసుకురావాలని కోరారు. వివరాలకు 9866 70657, 89785 21281 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్ రంగారెడ్డి టీమ్

1.మహేశ్వరం నియోజకవర్గం



అభ్యర్థి పేరు: పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి
సామాజికవర్గం: ఓసీ (రెడ్డి)
స్వగ్రామం: కౌకుంట్ల, చేవెళ్ల (మండలం)
విద్యార్హత: డిగ్రీ
భర్త పేరు: పట్లోళ్ల ఇంద్రారెడ్డి
పిల్లల పేర్లు: కార్తీక్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, కల్యాణ్ రెడ్డి
రాజకీయ నేపథ్యం..
- 2000 సంవత్సరంలో జరిగిన చేవెళ్ల ఉపఎన్నికలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపు.
- 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది వైఎస్సార్ క్యాబినేట్లో గనులు, భూగర్భశాఖ మంత్రిగా పనిచేశారు.
- 2009లో మూడోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది వైఎస్సార్ క్యాబినెట్లో హోంశాఖ మంత్రిగా పనిచేశారు.
- 2018లో మహేశ్వరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరి ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.
- 2023 మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు.

2.ఇబ్రహీంపట్నం నియోజకవర్గం



అభ్యర్థి పేరు: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
సామాజికవర్గం:ఓసీ (రెడ్డి)
స్వగ్రామం: వెలిమినేడు, ఇబ్రహీంపట్నం (మండలం)
విద్యార్హత: డిగ్రీ
భార్య పేరు: ముకుంద
పిల్లల పేర్లు: కుమారులు ప్రశాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్తె సీతల్
రాజకీయ నేపథ్యం..
- 1980–85 వరకు ఎల్మినేడు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 1982లో దివంగత ఎన్‌టీఆర్ స్థాపించిన టీడీపీలో చేరారు.
- 1985 సింగిల్ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్‌గా పనిచేశారు.
- ఉమ్మడి ఏపీలో ఏపీఐడీసీ చైర్మన్‌గా 2002–04 వరకు కొనసాగారు.
- 2005 నుంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2009లో పట్నంలో టీడీపీ నుంచి గెలుపొందారు.
- 2015, ఏప్రిల్ 27న బీఆర్ఎస్‌లో చేరారు.
- 2018లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు.
- 2023లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగోసారి ఇబ్రహీంపట్నం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

3.షాద్‌నగర్ నియోజకవర్గం



అభ్యర్థి పేరు: ఎల్లనమోని అంజయ్య యాదవ్
స్వస్థలం:ఎక్లాస్‌ఖాన్‌పేట, కేశంపేట(మండలం)
జన్మదినం: మే 10, 1950
సామాజిక నేపథ్యం: యాదవ్
విద్యార్హత: బీఎస్సీ(మ్యాథమెటిక్స్)
తల్లిదండ్రులు: బాలకిష్టమ్మ, ఆగమయ్య
పిల్లలు: ఎల్లనమోని రవీందర్ యాదవ్, ఎల్లనమోని మురళీకృష్ణ యాదవ్
రాజకీయ నేపథ్యం..
- 1985లో తెలుగుదేశం పార్టీ నుంచి కేశంపేట ఎంపీపీగా ఎన్నికయ్యారు
- 2001లో బీఆర్ఎస్ పార్టీలో చేరి కేశంపేట జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు
- 2009 ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు.
- 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసి ప్రతాప్‌రెడ్డిపై 20,425 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 2023 డిసెంబర్‌లో బీఆర్ఎస్ నుంచి మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

4.కల్వకుర్తి నియోజకవర్గం



అభ్యర్థి పేరు: గుర్క జైపాల్‌యాదవ్
పుట్టినతేది: 24-08-1954
సామాజిక వర్గం: బీసీ (యాదవ)
స్వగ్రామం: చల్లంపల్లి, కడ్తాల (మండలం)
విద్యార్హత: డిగ్రీ
భార్య: రాజ్యందేవి
పిల్లలు: రమేశ్, సంగీత, జ్యోతి, వాణి
రాజకీయ నేపథ్యం..
- జైపాల్‌యాదవ్ 1981 నుంచి 1986 వరకు చల్లంపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు.
- జనతా పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీ స్థాపించిన అనంతరం టీడీపీలో చేరారు.
- 1995లో తలకొండపల్లి జెడ్పీటీసీగా ఎన్నిక.
- 1997 నుంచి 1999 వరకు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.
- 1999 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు.
- 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.
- 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం.
- 2014లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందారు.
- 2018 ఎమ్మెల్యేగా విజయం(బీఆర్ఎస్).
- 2023 అసెంబ్లీ టికెట్ ఖరారయ్యింది.

5. శేరిలింగంపల్లి నియోజకవర్గం



అభ్యర్థి పేరు: ఆరెకపూడి గాంధీ
తల్లిదండ్రులు: చిత్తరంజన్‌దాస్, అనసూయమ్మ
వయస్సు: 61 సంవత్సరాలు
స్వస్థలం: పులకొండ, నందివాడ(మం), గుడివాడ, కృష్ణ జిల్లా
విద్యాభ్యాసం: ఐటీఐ
సంతానం: కొడుకు పృథ్వీ గాంధీ, కూతురు ప్రణతి గాంధీ
వృత్తి: రాధికా ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ
నివాసం: వివేకానంద నగర్, కూకట్‌పల్లి
రాజకీయ ప్రస్థానం..
- 2014లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా 80వేల మెజారిటీతో గెలుపొందారు.
- 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా 40వేల ఓట్ల మెజారిటీతో విజయం.
- 2023లో మళ్లీ బీఆర్ఎస్ తరపున బరిలో దిగనున్నారు.

6. ఎల్బీనగర్ నియోజకవర్గం



అభ్యర్థి పేరు: దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
స్వగ్రామం: మునిపంపుల, రామన్నపేట
స్థిరనివాసం: అక్బర్‌బాగ్, మలక్‌పేట్
విద్యార్హత: బీఏ
భార్య: కమలాదేవి
పిల్లలు: కుమారులు గౌతంరెడ్డి, ప్రీతంరెడ్డి
వృత్తి: రాజకీయం, వ్యాపారం
రాజకీయ నేపథ్యం...
- 1984లో ఇండియన్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ)లో చేరారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.
- 1986 నుంచి 91 వరకు అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేశారు.
- 2001–2004 వరకు అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్‌గా గెలుపొందారు.
- 2004 హుడా చైర్మన్‌గా ఎంపికయ్యారు.
- 2009లో ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా విజయం.
- 2018లో కాంగ్రెస్ నుంచి ఇదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఆ వెంటనే 2019లో అధికార బీఆర్ఎస్‌లో చేరారు.
- 2023లో బీఆర్ఎస్ తరపున పోటీ చేయబోతున్నారు.

7. చేవెళ్ల నియోజకవర్గం



అభ్యర్థి పేరు: కాలె యాదయ్య
పుట్టిన తేదీ: 18–05–1962
సామాజిక వర్గం: ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం: చించల్‌పేట్, నవాబుపేట
విద్యార్హత: బీఏ, కుటుంబం: భార్య, కొడుకులు(2), కూతురు
రాజకీయం నేపథ్యం...
- 1993–1996మధ్య కాలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు.
- 1992–95లో డీసీఎంఎస్ డైరెక్టర్‌గా, సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేశారు.
- 1995–2000 మధ్య కాలంలో నవాబుపేట జెడ్పీటీసీగా పనిచేశారు.
- 2001 నుంచి 2006 వరకు నవాబుపేట ఎంపీపీగా పనిచేశారు.
- 2009లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.
- 2014లో చేవెళ్ల కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.
- 2023 బీఆర్ఎస్ టికెట్ ఖరారైంది.

8.రాజేంద్రనగర్ నియోజకవర్గం



అభ్యర్థి పేరు: టి.ప్రకాష్ గౌడ్
సామాజిక వర్గం:గౌడ
స్వగ్రామం: మైలార్‌దేవ్‌పల్లి
విద్యార్హత:ఏడవ తరగతి
రాజకీయ నేపథ్యం...
- రాజేంద్రనగర్ మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడిగా పొలిటికల్ కెరీర్ ప్రారంభం
- 2009లో రాజేంద్రనగర్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు.
- 2014లో టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా గెలుపొంది.. ఆ తర్వాత కొద్ది కాలానికే బీఆర్ఎస్‌లో చేరారు.
- 2018లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నిలిచి గెలుపొందారు.
- 2023లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఖరారయ్యింది.

బీసీలకు 50శాతం టికెట్లు ఇవ్వాలి

ఆమనగల్లు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో 50శాతం పైగా బీసీలు ఉన్నారని అన్నారు. జనాభాలో దామాష ప్రకారం బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం కడ్తాల మండల అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేశ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ భాస్కర్ , నాయకులు పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లో బహిరంగ సభలు

కడ్తాల్: మండల కేంద్రంలో స్థానిక బీసీ సంఘం నాయకులతో సోమవారం.. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సమావేశమయ్యారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ, అనంతయ్య, నాయకులు రాజు, మహేశ్ తదితరులు ఉన్నారు.



విగత జీవిగా.. వచ్చిన వీరుడు

ప్రమాదవశాత్తు లద్దాక్ వద్ద ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ జవాన్ నీరటి చంద్రశేఖర్ మృతదేహం సోమవారం రాత్రి అతని స్వగ్రామమైన తిరుమని దేవునిపల్లికి చేరుకుంది. అప్పటికే ఇంటికి చేరుకున్న బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి.
– కొందుర్గు

బాలికపై సామూహిక అత్యాచారం

- కత్తులతో బెదిరించి లైంగికదాడి
- మీర్‌పేట పీఎస్ పరిధిలో ఘటన
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రాచకొండ సీపీ చౌహాన్


నిందితుల్లో ఒకడు అబేద్‌లాలా

మీర్‌పేట: కత్తులతో బెదిరించి నలుగురు యువకులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. తిరుమలగిరి లాల్‌బజార్‌కు చెందిన బాలిక (16) పదిహేను రోజుల క్రితం నందనవనంలో నివాసముండే తన అక్క (పెద్దనాన్న కూతురు) ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం ఇంట్లోని వారు బయటకు వెళ్లగా.. ఎనిమిది మంది దుండగులు వచ్చి తలుపులు కొట్టారు. ఈ సమయంలో ఇంట్లో బాధిత బాలికతో పాటు ఆమె తమ్ముడు, మరో నలుగురు చిన్నారులు లోపల ఉన్నారు. వీరిని కత్తులతో బెదిరించిన నలుగురు యువకులు బాలిక మినహా అందరిని మూడో అంతస్తులోకి తీసుకెళ్లారు. బాలికను మాత్రం అదే గదిలో ఉంచి మిగిలిన నలుగురు లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం అందరూ కలిసి పారిపోయారు. బాలిక అక్క వచ్చిన తర్వాత జరిగిన విషయం చెప్పడంతో మధ్యాహ్నం 12 గంటలకు మీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి ఏడు బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నట్లు మీర్‌పేట సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. విషయం తెలుసుకున్న రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మీర్‌పేట పోలీసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిందితులను వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు, పోలీసుల పనితీరుపై ఆయన ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాగా యువకులు గంజాయి సేవించి ఉంటారనే స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుల్లో నలుగురు స్థానికంగా ఉంటారని, ఇందులో అబేద్‌లాలా, టైసలు కాగా మరో ఆరుగురి వివరాలు తెలియాల్సి ఉంది.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

కొందుర్గు: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష పడింది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేగడిచిల్కమర్రి గ్రామానికి చెందిన పుడుగుర్తి గణేష్(31) ఐదేళ్ల బాలికకు చాక్లెట్లు ఇప్పిస్తానని ఆశచూపి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు 2017 మార్చి 18న కొందుర్గు పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా సోమవారం జిల్లా న్యాయమూర్తి జయప్రసాద్ నిందితుడు పుడుగుర్తి గణేష్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

భార్య, కూతురు మృతికి నువ్వే కారణం

భర్తకు పదేళ్ల జైలు శిక్ష విధించిన షాద్‌నగర్ సెషన్స్ కోర్టు

కొత్తూరు: భార్య మృతికి కారణమైన భర్తకు పదేళ్ల జైలుశిక్షతో పాటు పదివేల రూపాయాల జరిమానా విధిస్తూ షాద్‌నగర్ సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించిందని సీఐ శంకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు మండలంలోని కొడిచర్లతండాకు చెందిన పాత్లావత్ రాజు, స్వర్ణ.. ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక కూతురు ఉంది. తండాలోనే నివాసం ఉంటూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన భర్తకు ఇతర మహిళతో అక్రమ సంబంధం ఉందంటూ భార్య అనుమానించగా.. ఇద్దరి మధ్యన మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన స్వర్ణ(భార్య) తన కూతురుతో కలిసి అక్టోబర్ 21, 2022లో తండా సమీపంలోని క్వారీ నీటిగుంతలో పడి ఆత్మహత్య చేసుకుంది. అప్పట్లో మృతురాలి తల్లి శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రాజుపై కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన షాద్‌నగర్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి.. భార్య, కూతురు మృతికి కారణమైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు.